క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే వసంత



ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దంపతులకు వేద పండితుల ఆశీర్వచనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను వేద పండితులు ఆశీర్వదించగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ధర్నా

తిరువూరు: విభజన చట్టానికి అనుగుణంగా కేంద్రబడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించనందుకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోస్టాఫీసు ఎదుట ధర్నా చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రం ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని, కొత్త రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయక, పోలవరంకు నిధులు ఇవ్వకపోవడం తగదని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి తూము కృష్ణయ్య పేర్కొన్నారు. పార్టీ నాయకులు సుందరరావు, నాగులమీరా, సుబానీ, ముత్తయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభరీతిలో బోధించాలి

గోసవీడు(గంపలగూడెం): విద్యార్థులకు సులభరీతిలో అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈఓ బి. సోమశేఖర్ పేర్కొన్నారు. గంపలగూడెం మండలం గోసవీడు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వార్షిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. హెచ్‌ఎం సుబ్బారావు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి అట్లూరి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

12న ఘంటసాల స్వరార్చన

నూజివీడు: సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 12న పట్టణంలో ఘంటసాల స్వరార్చన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్, వేంపాటి మోహన్ శుక్రవారం తెలిపారు. నూజివీడు కళావేదిక, శ్రీ సత్య నృత్య సంగీత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 4.45 గంటల నుంచి స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి సమీపంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహిక గాయకులు, ఘంటసాల అభిమానులు పాల్గొని విజయంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నగదు డిపాజిట్ సెంటర్ ప్రారంభం

తిరువూరు: భారతీయ స్టేట్ బ్యాంకు సేవలను ఖాతాదారులకు మరింత చేరువ చేసే నిమిత్తం నగదు డిపాజిట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ రంగరాజన్ తెలిపారు. తిరువూరు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన నగదు డిపాజిట్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. బ్యాంకు లావాదేవీలను త్వరితగతిన ముగించుకునేందుకు వినియోగదారులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఏజీఎం రాధిక, తిరువూరు శాఖ మేనేజర్ ఫణిబాబు, అసిస్టెంట్ మేనేజర్ శ్రావణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి



గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందిన యాచకుడు

మైలవరం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యాచకుడు మృతి చెందిన సంఘటన మైలవరం మార్కెట్ యార్డు సమీపంలో శుక్రవారం జరిగింది. మైలవరం మార్కెట్ యార్డు వద్ద శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఎస్ఆర్ హోటల్ సమీపంలో సుమారు 60 సంవత్సరాలు వయస్సున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ నేపథ్యంలో యాచకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై రాంబాబు తెలిపారు. వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి తెలియజేయాలని ఎస్సై పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఖిల్లా రోడ్డులోని సాయిబాబా మందిరంలో భక్తిసమాజం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కుమారి, భవానీ, సుహాసిని పాల్గొన్నారు.

సంక్షేమం జగన్‌కు మాత్రమే సాధ్యం

ఎమ్మెల్యే రక్షణనిధి



జింకలపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

జింకలపాలెం(గంపలగూడెం): ఒక కుగ్రామంలో 1,526 మంది లబ్ధిదారులను వివిధ సంక్షేమ పథకాలలో ఎంపిక చేసి, 44 నెలల వ్యవధిలోనే రూ.4.21కోట్లు లబ్ధిని నేరుగా వారి బ్యాంకు అకౌంట్లలో జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలను-2 సచివాలయం పరిధిలోని జింకలపాలెంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేసి లబ్ధిని పారదర్శకంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఇలాంటి పథకాలు భవిష్యత్‌లో అమలుకావాలంటే 2024 ఎన్నికల్లో ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మరోసారి పట్టం కట్టాలన్నారు. కాగా ఎమ్మెల్యే గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి కుటుంబాలకు అందిన సంక్షేమాన్ని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అర్హతలై ఉండి సంక్షేమ పథకాలు పొందని వారు వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తామన్నారు. తిరువూరు ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, సర్పంచ్ సంగెపు లలిత, ఎంపీటీసీ సభ్యుడు శ్రీను, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు చెన్నకేశవరెడ్డి, నరసారెడ్డి, నాయకులు కరుణాకర్‌రావు, దాసు, బాలు, కోటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వ్యవసాయ అధికారి బి.సాయిశ్రీ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు వెంకటరావు



వెంకటరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత



చనమోలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: మాజీ మంత్రి చనుమోలు వెంకటరావు చిరస్మరణీయుడని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆయన జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే వసంత నివాళులర్పించారు. చనుమోలు హయాంలో మైలవరంలో అనేక గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధి జరిగిందన్నారు. నేటి తరానికి ఆయన స్ఫూర్తిప్రదాత అన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, పీఏసీఎస్ చైర్మన్ ఎం.శివారెడ్డి, నియోజకవర్గం బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు ఎస్.శివశంకరరావు, సర్పంచ్ రెంటపల్లి నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, లక్ష్మీ, దుర్గాప్రసాద్, చిన్నయ్య పాల్గొన్నారు.

చనమోలు సేవలు ప్రశంసనీయం

మైలవరం: మాజీ మంత్రి దివంగత చనమోలు వెంకట్రావు మైలవరం నియోజకవర్గానికి చేసిన సేవలు ప్రశంసనీయమని జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. తిరుపతిరావు తెలిపారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు జీ వెంకట్రావు ఆధ్వర్యంలో దివంగత మంత్రి చనమోలు వెంకట్రావు జయంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. మాజీ మంత్రి తివంగత వెంకట్రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక మూడు బొమ్మలు సెంటర్‌లోని వెంకట్రావు విగ్రహానికి నివాళులర్పించారు. సర్పంచ్ మంజుభార్గవి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నారాయణరెడ్డి, కోటిరెడ్డి, వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ పురాణం శాంతారావు, కోటిరెడ్డి, లక్ష్మీ, మేరీ ప్రశాంతి పాల్గొన్నారు.

వెంకటరావుకు నివాళి

ఇబ్రహీంపట్నం: మైలవరం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చనుమోలు వెంకటరావు జయంతి కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ ఆయన విగ్రహానికి పూలమాలలతో శ్రద్ధాంజలి అర్పించారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గ అభివృద్ధిలో దివంగత ఎమ్మెల్యే చనమోలు వెంకట్రావు సేవలు ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు అన్నారు. వెంకట్రావు జయంతిని జి.కొండూరులోని కొత్తూరు రోడ్డు వద్ద గల ఆయన విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

తిరువూరు: తిరువూరు నగరపంచాయతీ పరిధిలోని 10, 11 వార్డులలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే కే రక్షణనిధి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

నూజివీడు: స్థానిక న్యాయస్థానాల భవనం ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

చాట్రాయి: ఉపాధి హామీ పథకంలో పనులను వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ ఎస్ మురళీమోహనరావు తెలిపారు. శుక్రవారం చాట్రాయి మండలం బూరుగుగూడెంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల నమోదు పెరగాలని ఆయన ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

13న కనక దుర్గ అమ్మవారి దేవస్థాన వార్షికోత్సవం

విస్సన్నపేట: స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న కనక దుర్గా అమ్మవారి దేవస్థానం 23వ వార్షికోత్సవం ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించటంతో పాటు కుంకుమార్చన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

పట్టణంలో పర్యటించిన కమిషనర్

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ వెంకటేశ్వర్లు పట్టణంలో పర్యటించారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకే కార్యాలయానికి చేరుకున్న ఆయన ఇబ్రహీంపట్నం పరిధిలోని పలు వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్యం పనులు, కార్మికుల హాజరు శాతం తనిఖీ చేశారు. విధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

సంక్షిప్త వార్తలు


గోల్డ్ కాయిన్ అందజేత



గోల్డ్ కాయిన్ అందజేస్తున్న మేనేజర్ సాంబమూర్తి

ఎ.కొండూరు: మండలంలోని రేపూడి గ్రామంలో పాల సంఘం సభ్యుడికి కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో కల్యాణమస్తు పథకం శుక్రవారం అందించారు. కల్యాణమస్తు పథకానికి అర్హులైన పాలంకి సుబ్బారెడ్డి కుమారుడు రవీంద్రరెడ్డి వివాహం సందర్భంగా రూ.20వేల విలువ చేసే గోల్డ్ కాయిన్‌ను తిరువూరు పాలసీతలకేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి అందించారు. సంఘ పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వజ్రాల బ్రహ్మానందరెడ్డి, సంఘం అధ్యక్షుడు రేగళ్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

రెడ్డిగూడెం: రెడ్డిగూడెంలో అంకమ్మ తల్లి ఆలయంలో ఆరో వార్షిక మహోత్సవ పూజలు అత్యంత వైభవోపేతంగా భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపాటి పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు వెంకటేశ్వర శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, కిరణ్‌శాస్త్రి, సుధీర్ శర్మతో వేద మంత్రాల నడుమ అశేష భక్త జన సందోహంతో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ అన్నదానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఇబ్రహీంపట్నం, మండల పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ విజయవాడ రూరల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి 11గంటల వరకు ఫెర్రీ రోడ్డు, కేరళా హోటల్ సెంటర్, ఐశ్వర్యా గ్రాండ్ అపార్ట్‌మెంట్, తుమ్మలపాలెం, తూర్పు ఇబ్రహీంపట్నం, రామ్‌కో హెచ్‌టీ, వెస్ట్ ఏరియా, ట్రక్ టెర్మినల్, జూపూడిలో కొంతభాగం, మైలవరం రోడ్డు, ఎన్టీటీపీఎస్ పాతగేటు, రింగ్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మూడు గంటల పాటు నిలిచిపోతుంది.

జగనన్న పాల వెల్లువపై అవగాహన

రెడ్డిగూడెం: జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాల సేకరణ పెరిగేలా సిబ్బంది రైతులను ప్రోత్సాహించాలని ఎంపీడీఓ శంకరరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ కేంద్రం నిర్వహణపై శుక్రవారం ఎంఎస్, వీఓఎస్ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాల సరఫరా చేసే రైతులకు జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా అందజేస్తున్న రాయితీలు, వసతులు, సౌకర్యాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి రఘునాథ స్వామి ఆలయ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను ఆలయ ఈఓ సమక్షంలో సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. రఘునాథ స్వామి ఆలయానికి నాటి జమీందారులు దీపధూప నైవేద్యాలకు దాదాపు 3,600 ఎకరాల భూమి ఇచ్చారు. ఈ భూములను ఆక్రమణదారులు అగ్రిమెంట్లు రాసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఈ భూముల్లో పలు కట్టడాలను నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేంపాడు అగ్రహారం సమీపంలోని కొత్తపల్లి వద్ద ఈ ఆలయ భూమిలో నిర్మిస్తున్న షెడ్డును సిబ్బంది కూల్చివేశారు. ఆలయ ఈఓ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గతంలో నిర్మించిన భారీ కట్టడాలను సైతం జేసీబీతో కూల్చివేస్తామన్నారు. దేవాలయ భూముల్లో ఎవరైనా అక్రమ కట్టడాలు కట్టినా, కట్టడానికి ప్రయత్నించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీహెచ్‌సీ తనిఖీ

ముసునూరు: ప్రజారోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను నాణ్యతగా ప్రజలకు అందాలని జిల్లా వైద్యాధికారి, మండల ప్రత్యేకాధికారి ఎం.నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ఓపీ వివరాలను, ఫార్మసీ, రోగులకు అందుతున్న సదుపాయాలను వైద్యాధికారి ఎం.కిరణ్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు.

బలివే ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ముసునూరు: భక్తులకు కల్పించే సౌకర్యాలే ఉత్సవాలకు విజయాన్నిస్తాయని జిల్లా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. తహసీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో బలివేలోని మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఉత్సవ ప్రాంగణం, స్నాన ఘట్టాలను పరిశీలించి, భక్తుల సౌకర్యమే ఉత్సవాల విజయానికి నాంది అని భక్తులకు అన్ని సౌకర్యాలు, పటిష్టమైన భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఎంపీడీఓ జి.రాణి, పీఆర్‌ఏఈ తిరుమలశెట్టి నరసింహారావు, కార్యదర్శి యోహాన్ పాల్గొన్నారు.

ప్రజ్ఞా వికాసం పోస్టర్ ఆవిష్కరణ

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) మైలవరం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 10వ తరగతి మోడల్ పరీక్ష పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాంప్రసాద్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రజ్ఞా వికాసం పేరుతో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజ్ఞా వికాసం మోడల్ పరీక్ష ఈ నెల 20న సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని, పరీక్షకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.25 ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు మైలవరం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను సంప్రదించాలని తెలిపారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు

జి.కొండూరు: రబీ సాగు చేపట్టిన రైతులు తమ పంటలను తప్పకుండా ఈ క్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జమ్ముల హనుమంతురావు అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ జరిగిన తీరుపై చర్చించారు. ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా కోట శివాలయం పునఃప్రతిష్ట



పునఃప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: స్థానిక కోట లోపల శివాలయం, ధ్వజస్తంభ పునఃప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం ఉదయం 8.49 గంటలకు వందల మంది భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. స్వామిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి డీఏఆర్ కళాశాల గ్రౌండ్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వంశపారంపర్య ఆలయ ధర్మకర్త మేకా మెహర్‌రామ్ వెంకటాద్రి అప్పారావు, కార్యవర్గ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, పైడి అనిల్‌కుమార్, సంచి నిర్మల శంకర్, నల్లమూడి వెంకటేశ్వరరావు, క్రోసూరు రమేష్, పరిమిశెట్టి సాయి షణ్ముక శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అధికారి విజయభారతి

మైలవరం: ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో వ్యవసాయ కార్యక్రమాలు అమలుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయభారతి తెలిపారు. మైలవరంలోని రైతు భరోసా కేంద్రం-4లో జిల్లా స్థాయి ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంపై శుక్రవారం వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ మండల అధికారులు, వీఏఏలకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభారతి మాట్లాడుతూ తక్కువ నీటితో, తక్కువ ఖర్చుతో చెరువుల కింద సాగు చేసే రైతులకు ఎక్కువ దిగుబడి వచ్చేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ఇవ్వాల్సిందిగా వీఏఏలకు తెలిపారు. చెరువులు ఆధారంగా తక్కువ నీటిని వినియోగించే విధానం వివరించాలన్నారు. అనంతరం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఏడీ నూతన కార్యాలయం భవనాన్ని విజయభారతి సందర్శించారు. కార్యక్రమంలో ఏపీడీ శివనాగేశ్వరరావు, మైలవరం మండల ఏడీఏ శ్రీనివాసరావు, తిరువూరు ఏడీఏ కెనడీ, మైలవరం మండలం, రెడ్డిగూడెం మండలం ఏఓలు కే సంధ్యారాణి, సురేష్, మైలవరం మండలం ఉద్యాన శాఖ అధికారి అహ్మద్, రెడ్డిగూడెం ఉద్యాన అధికారి నరేంద్రకుమార్, వీఏఏలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు కృషి చేయాలి



పాలిటెక్నిక్ విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ జానకిరామ్

నూజివీడు: పట్టణంలోని మామిడి పరిశోధన స్థానం ఆవరణలో ఉన్న ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలను డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య టి.జానకిరామ్ శుక్రవారం సందర్శించారు. కళాశాలలోని తరగతులను సందర్శించి విద్యార్థులతో పలు విషయాలపై ముఖాముఖి నిర్వహించారు. బోధన, బోధనేతర సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ల్యాబ్‌లను పరిశీలించారు. మామిడి పరిశోధనాస్థానం ఆవరణలో విద్యార్థులు చేసే ప్రయోగాలను సందర్శించారు. కూరగాయలు, పూలు, ఔషధ నమూనాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉద్యానపంటల సాగులో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడంతోపాటు ఆధునిక పద్ధతుల్లో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడినిచ్చే పండ్లతోటల సాగుకు కృషి చేయాలని అన్నారు. రైతుల్లో పండ్లతోటల పెంపకంపై చైతన్యం తీసుకొచ్చేందుకు పాటుపడాలని సూచించారు. విద్యార్థులు అడిగిన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ సదుపాయాలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

భూ హక్కు కల్పించాలి



గొల్లపల్లిలోని ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో స్వయంభూ రఘునాథ స్వామి ఆలయ సాగు భూములపై హక్కు కల్పించాలని చిన్న, సన్న కారు రైతులు ఆందోళన చేపట్టారు. ఆలయానికి 3,400 ఎకరాల భూమి ఉండగా, అందులో సాగు చేస్తున్న రైతులందరూ రామదండు పేరుతో గొల్లపల్లిలోని ఎండోమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఈఓ ఎల్లాప్రగడ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. బడా భూస్వాములకు వందలాది ఎకరాలకు భూ హక్కులు కల్పించి, పట్టాదారు పాసుపుస్తకాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. స్థానికేతరులైన కబ్జాదారులు దాదాపు వెయ్యి ఎకరాలను ఆక్రమించి బినామీ వ్యక్తులతో సాగు చేయిస్తున్నారని ఆరోపించారు. స్వామిని నమ్ముకుని సాగు చేస్తున్న భూముల్లో తమకు హక్కులు కల్పించే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు నిధులు కేటాయించాలి



ఎస్‌బీఐ ఎదుట సీపీఐ నాయకుల నిరసన ప్రదర్శన

మైలవరం: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు మరిన్ని నిధులు కేటాయించాలని, అదానీ ఆస్తులను జాతీయం చేయాలని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర కమ్యూనిస్టు సమితి సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిస్టు సమితి పిలుపు మేరకు మైలవరం శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద, స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు మరిన్ని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, మైలవరం మండల సీపీఐ ఇన్‌చార్జి కార్యదర్శి బుద్దారపు వెంకట్రావు, నియోజకవర్గ కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.